కథానిక

# "కీర్తి కండూతి"

అనగనగా ఒక రాజుగారి ఏడుగురు కొడుకులూ వేటాడి తెచ్చిన ఏడు చేపల్లో ఏడోది మాత్రం యెండక పోవటం, 'చేపా చేపా ఎందుకు ఎండలేదు?' అని రాకుమారులు తీగలాగితే డొంక కదలటం - షరామామూలే.

ఆపైన—

ఎండని చేప సృష్టించిన సమస్యలతో రాకుమారుల బుర్రలు వాచిపోయాయి. వాళ్ళకు వేటమీద, జీవితం మీద విరక్తి కలిగింది. ఇలా కొంత కాలం గడిచాక ఒకనాడు వాళ్ళు ఎవరో పెంచిన ఒకసాహితీ వనంలో అడుగు పెట్టారు. అక్కడి సాహితీ సౌరభము వారి సేదదీర్చి, విశ్రమింపజేసింది. దానితో—వారు సాహితీ వన ఆవశ్యకతను గుర్తించినవారై తామే ఒక సాహితీ వనాన్ని స్థాపించాలని అప్పటికప్పుడే నిర్ణయించారు.

అంతఃపురం చేరి అర్జెంటుగా కుల గురువును వివరాలడిగేరు. మూడుకిలోల స్వామీజీ ప్రమింగి త్రికాలవేది నోరు విప్పాడు. 'ఏడేడు సముద్రాల కవతల ఒక సాహిత్య ద్వీపం, ఆ ద్వీపంలో భయంకరమైన ఒక పూడలమర్రి. ఆ మర్రి తొర్రలో ఒక ఋషి, ఆయన అనుగ్రహం పొంది ఆ దీవిలోని సాహితీ ప్రక్రియలు: ప్రణాళికా విత్తనాలు, ఆర్థిక ఎరువులు, సంచలిత నీరు, రక్షక పాకల్లాటి సరంజామా తీసుకు రాగలిగితే మంచి సాహితీ వనాన్ని స్థాపించవచ్చునట!'

అదెంత పనని అనుకున్నవారై, ఏడుగురు రాకుమారులు ఓ శుభ మూహూర్తాన తలిదండ్రుల ఆశీర్వాదం పొంది ఏడు సంచులు తీసుకుని సాహితీ ద్వీపానికి ప్రయాణం కట్టారు తమ విధి నిర్వహణ విన్యాసాలతో ముందుకు సాగారు.



అలా కొంత దూరం పోయాక, మొదటి వాడు నిట్టూర్చాడు. ఇంకొంచం దూరం పోయాక రెండో వాడు ఆవులించాడు ఇంకా కొంచెం దూరం పోయాక మూడో వాడు నడక మందగించాడు. మరి కొంత దూరం సాగాక నాల్గోవాడు నడక మానేశాడు. తర్వాత ఐదోవాడు అలసటని చెప్పి ఒకచోట ఆగిపోయాడు. ఆరోవాడు మెజారిటీ వైపు మొగ్గాడు.

అంతవరకూ ఏకధాటిగా నడుస్తున్న ఏడో వాడు మొదటిసారిగా వెనుదిరిగి చూశాడు చూస్తే ఏముంది? తను ఒంటరి వాడై పోయాడు.

క్షణంపాటు కళ్ళు మూసుకుని, కుం

— జి. వి. రమణారెడ్డి

దేవతను తలుచుకుని ఏడో రాకుమారుడు గమ్యం వేపు సాగిపోయాడు.

దారిలో పడరాని పాట్లు పడ్డాడు. రెండు చోట్ల శాప గ్రస్తుడయ్యాడు మళ్ళీ శాప విముక్తుడయ్యాడు. (రాకుమారులకు యిది మామూలే). ఎలాగయితేనేం చివరకు తను మోయగలిగినంత సాహితీ సంపదతో రాకుమారుడు తిరిగి నగరును చేరుకున్నాడు.

తను తీసుకువచ్చిన ఒకే ఒక ప్రణాళికా విత్తనాన్ని నాటి, ఆర్థిక ఎరువువేసి, రక్షక పాదు చేసి, సంచలితనీటిని పోసి, అహర్నిశలూ ఆ విత్తు ంకురానికి శ్రమ పడ్డాడు.

ఓ శుభోదయాన ఆ ప్రణాళికా విత్తనం మొలకెత్తింది, రాకుమారుని ఆనందానికి పట్టపగ్గాలు లేవు. మొలక కొమ్మ వేసింది రాకుమారుని ఆనందానికి అవధులు లేవు కొమ్మ మొగ్గ తొడిగింది. రాజకుమారుని ఆనందం ముందు ఏదీ సాటిరాలేక పోయింది.

రేపు మొగ్గ విచ్చుకుంటుంది దాని సౌరభం జగమంతా నిండిపోతుంది. ఆ సౌరభాన్ని స్వయంగా విస్తరింపజేసి సాహితీ ప్రియుల ప్రశంశలు పొందుతాను -అనుకున్నాడు రాకుమారుడు.

ఆ రాత్రికి ఆ మొక్క ప్రక్కి దే పడుకున్నాడు. ఇన్నాళ్ళూ అనుభవించిన నిద్ర లేమిని తీర్చుకున్నాడు. ఆ నిద్రలో ఒక కలకూడా కన్నాడు.

తను యింత కాలం శ్రమించి, పండించిన సాహితీ పంటన్న ఎవరో ఆరుగురు దుండుగులు వచ్చి దోచుకోబోయారట! తను ధైర్యంతో ఎదుర్కొన్నాడట. వాళ్ళు తన ధాటికి ఆగలేక వెనుదిరిగి పారిపోయారట! తను విజయంతో దిక్కులు పిక్కటిల్లే టట్లు నవ్వాడట.

నవ్వుతున్న రాజకుమారునికి మెళకువ వచ్చింది. కళ్ళుతెరిచి చూసుకునే సరికి తను సాహితీ వనానికి దూరంగా ఓ చిన్న మురుగ్గుంటలో కాళ్ళూ చేతలూ కట్టివేయబడి పడివున్నాడు.

అతి కష్టంమీద కట్లు విప్పుకుని సాహితీ వనానికి వరుగెట్టిన రాకుమారుడా మొక్కను చూసి నిలువునా కూలిపోయాడు! 34

మొక్క తోసి పోయింది!!

"దిగులు పడకు!" మొక్క జాలిగా అంది.

"కష్టమొకరిదీ, ఫలితమొకరిదీనా?" అన్నాడు రాకుమారుడు.

"నాదేం తప్పు లేదు" అందిమొక్క

"నీ తప్పుకాదు-నా ఖర్మ"

"ఎక్కడికి అలా వెళ్ళిపోతున్నావు"?

"ఎక్కడికో - సాహితీ సేవకు మాత్రం కాదు,"

"అదేం?"

"జరిగింది చూశావుగా! వృధా ప్రయాస నాకెందుకూ?"

"అలా నిరాశపడకు వంటవాడికి రావలసిన మెప్పు వడ్డించేవాడికి ఎన్నడూ పోదు"

"అంతే"

"కీర్తికండూతి చోరులకు వుంటుంది. పోషకులకు కాదు. నీవు పెంచే సాహితీ మొలక నిన్ను పెంచుతూనే వుంటుంది. నీకు తెలియకుండానే తన ప్రతిఫలాన్ని సమర్పించుకుంటూనే వుంటుంది."

రాకుమారుని శరీరం సాహితీ మొలక చిందిన సౌరభంతో గుబాళించింది. కుమారుడు వుల్లాసంగా కదిలాడు

"ఎక్కడికి?" అడిగింది మొక్క

"సాహితీ ద్వీపానికి-మరో ప్రణాళికా విత్తనం కోసం-" అని ముందుకు సాగిపోయాడు.

అంతవరకూ ఆ ప్రక్క పొదలో దాగివున్న ఆరుగురు రాకుమారులు ఏదో వాని ప్రయత్నం చూసి, తమకు రాబోయే కీర్తిని తలుచుకుని మురిసిపోయారు.

—ooo—

35

# తిరుగుబాటు !

వూళ్ళనే కూకటి వేళ్ళతో
వూడ్చివేసిన ఉప్పెన వుగ్రతాండవం
అప్పుడే మరచి పోయారా ?

అగ్ని తాండవార్భటిలో
శిలాద్రవం కక్కుతూ బూడిద
కుప్పలను పేర్చిన కరాళ కథలను
యింతలోనే విస్మరించారా ?

నాశిరః కంపన మాత్రంతో
జనపదాలు దద్దరిల్లిన ఘోర చరిత్ర
మీ స్మృతి పథాల్నుంచి
చెదరి పోయిందా ?

ఒట్టి వడగాల్పులకే కనలిపోయి
గూటిలో గువ్వల్లా మసలుకొనే మీరు
నాపై తిరుగుబాటుకు ఎగబడేముందు
మీ యిల్లు చక్కబెట్టుకోండి.

నా ఆగ్రహానికి గురై అలమటిస్తున్న
ఆర్తుల ఆక్రందనాలకు కరగిన
హృదయాలు అందిస్తున్న
స్నేహ హస్తానికి అడ్డుతగిలి
అర్థార్జన గావిస్తున్న ఆకతాయి
మనుషులపై తిరుగుబాటు చేయండి.

కాలగర్భంలో దాగిన నా వాలకం
పసిగట్టేందుకు అగచాట్లు పడేముందు
వూళ్ళేలే పెత్తందారుల అక్రమాలపై
తిరుగుబాటు బావుటా ఎగిరేయండి
ఆపై తాపీగా నా కూపీ తీయటం
అందరూ కలసి ఆలోచించండి.

—జానమద్ది హనుమచ్ఛాస్త్రి